ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



వెలుగులీనుతున్న తిరుచానూరు







విద్యుద్దీప కాంతుల్లో తిరుచానూరు వెలిగిపోతోంది. గురువారం నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ క్రమంలో ఆలయం, తిరుమాడవీధులు, పుష్కరిణి, గాలిగోపురం, ఉద్యానవనం తదితర ప్రాంతాలు ఆదివారం రాత్రి విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేస్తున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. గృహస్థులు (ఇద్దరు) రూ.1,116 చెల్లించి టికెట్ కొని ఈ సేవలో పాల్గొనవచ్చు. ఆలయం వద్ద కౌంటర్‌లో కరెంట్ బుకింగ్‌లో ఈ టికెట్లు పొందవచ్చు. **- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి**



హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

● దౌర్జన్యం చేసిన వారు.. పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో నిందితులు

● వీరంతా వైసీపీకి చెందిన వారే!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విధుల్లో వున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని నలుగురు రౌడీలు దాడి చేశారు. మ్యాన్ ప్యాక్ లాక్కొని దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ నలుగురు గతంలో పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులు. వైసీపీకి చెందిన వారు. ఈ ఘటన ఆదివారం ఆర్‌సీ పురం జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. సుండుపల్లికి చెందిన సాయికుమార్ కారులో ఆర్‌సీ పురం నుంచి తిరుపతికి వస్తున్నారు. ఆర్‌సీ పురం జంక్షన్ దాటుతుండగా చంద్రగిరి నుంచి రేణిగుంటకు వెళుతున్న స్కార్పియో వాహనం డ్రైవరు కారును నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. ఈ ఘటనలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే రక్షక్ ఆరులో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళారు. హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్య ట్రాఫిక్ క్లియర్ చేస్తూ.. ప్రమాదంలో దెబ్బతిన్న కార్లను పరిశీలిస్తున్నారు. స్కార్పియో వాహనంలో వున్న ఆర్‌సీ పురం మండలం సీ.రామాపురం గ్రామానికి చెందిన ఎస్.జయచంద్రారెడ్డి, నెన్నూరుకు చెందిన మునిబాలాజి, తిరుపతికి చెందిన ట్రావెల్ బిజినెస్ చేస్తున్న ఆర్.అన్వర్‌బాషా, తనపల్లికి చెందిన లోకేష్‌రెడ్డి.. హెడ్ కానిస్టేబుల్ షర్టు పట్టుకుని దాడి చేసి దౌర్జన్యానికి దిగారు. మ్యాన్ ప్యాక్, మొబైల్ ఫోను లాక్కొని కొట్టారు. ఈ ఘటనపై కోదండరాం మ్యాన్ ప్యాక్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చిన్నగోవిందు చెప్పారు. ఈ నిందితులపై గతంలో పద్మావతి వర్సిటీ వద్ద పులివర్తి నానిపై (ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే) జరిగిన హత్యాయత్నం కేసులో రౌడీషీట్లు ఉన్నాయని చెప్పారు. వీరంతా వైసీపీకి చెందిన వారు కావడం గమనార్హం.

కంగారు పుట్టించిన వెండి విరాళం

తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి విరాళంగా వచ్చిన వెండి పూజా సామగ్రి అధికారుల్లో కంగారు పెట్టించింది. ఈనెల 18వ తేదీన ఓ భక్తుడు 6.7 కిలోల వెండి బిందె, దీపస్తంభాలు, ప్లేట్ వంటి పూజా సామగ్రిని విరాళంగా ఇచ్చారు. ఆలయంలో అర్చకులకు అందజేసినట్టు మీడియాతో వార్తలు వచ్చాయి. అయితే భక్తుడి నుంచి తమకు ఎలాంటి వెండి వస్తువులు అందలేదని టీటీడీ అధికారులు విజిలెన్స్ అధికారులకు తెలియజేయడంతో వారు విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత భక్తుడు ఆ వస్తువులను ఆలయంలోని హుండీలో సమర్పించినట్టు తేలింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ఓటరు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్వో

ఓటు నమోదుకు యువత ఆసక్తి

● 1,019 మంది దరఖాస్తు

● రెండు రోజుల్లో అందిన క్లెయిమ్‌లు 2,435

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శని, ఆదివారాల్లో ఓటు నమోదు, సవరణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదికి 18 ఏళ్లు నిండే యువత ఓటు నమోదుకు ఆసక్తి చూపారు. ఈ రెండు రోజుల్లో 1,019 యువ ఓటర్లు నమోదుకు ఆసక్తి చూపారు. ఇక, రెండో రోజు ఓటర్ల నమోదు, సవరణకు 2,141 పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్వోలకు 1,392 క్లెయిమ్‌లు అందాయి. ఇందులో ఓటు నమోదుకు 550 దరఖాస్తులు రాగా.. విదేశాల్లోని 90 మంది ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపునకు 362, ఓటు బదిలీ, సవరణకు 390 క్లెయిమ్‌లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇలా రెండు రోజుల్లో 2,435 క్లెయిమ్‌లు అందాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు గైర్హాజరైనట్లు సమాచారం. వారిపై అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.



సైబర్ ఉచ్చులో సామాన్యులు

● వారం రోజుల్లో ఐదు ఘటనలు

● షేర్ మార్కెట్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ పుత్తూరుకు చెందిన ఒక చోటా వ్యాపారి వాట్సాప్‌కు అక్టోబరులో మెసేజ్ వచ్చింది. నిఫ్టీ, ఆప్షన్ ట్రేడింగ్ ద్వారా నెలకు రూ.లక్ష సంపాదించవచ్చని, అవగాహన కోసం యూట్యూబ్ లింకులు పంపారు. ఆ మెసేజ్ నిజమని భావించిన ఆయన.. వారు సూచించిన టెలిగ్రామ్ గ్రూపులో చేరి పెట్టుబడులు పెట్టారు. విడతలవారీగా దాదాపు రూ.20 లక్షలు పెట్టుబడులు పెట్టి మోసపోయారు.

● తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువులు మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారి జయరామిరెడ్డి ప్రమేయం లేకుండానే వీఐపీ ఈ7 ఇన్వెస్టుమెంటు అలియన్స్ లెర్నింగ్ వాట్సాప్ గ్రూపులో ఆయన్ను ఈ నెల 21న యాడ్ చేశారు. ఈ గ్రూపులో వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఆయన డౌన్‌లోడ్ చేశారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అతడి బ్యాంకు ఖాతాలో రూ.13.5 లక్షలు ఉన్నాయి. వీటితో ట్రేడింగ్ చేయగా.. ఆ మొత్తం రూ.24.3 లక్షలు చూపింది. విత్‌డ్రా చేసే సమయంలో ఆ యాప్ కనిపించకుండా పోయింది. ఇలా, రూ.13.5 లక్షలు నష్టపోయిన ఆయన తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాజాగా మోసపోయిన మరొకరు

తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ ఆంధ్రాబ్యాంకు కాలనీలో ఉంటున్న సతీష్ ఓ మిల్క్ కంపెనీలో లాజిస్టిక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ఈయనకు సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ లింకు పంపారు. దీనిలో జేపీ మోర్గాన్ అనే వాట్సాప్ గ్రూపులో జాయిన్ చేయించారు. ఆ తర్వాత జేపీఎంసెక్యూరిటీ.కామ్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా స్టాక్ ట్రేడింగ్ చేయించారు. ఈయన పంపిన దాదాపు రూ.తొమ్మిది లక్షలను ఐదు బ్యాంకు అకౌంట్లలోకి డిపాజిట్ చేయించుకున్నారు. సదరు మొత్తం నగదుకుగాను అదనంగా ప్రాఫిట్‌తో కలిపి రూ.19 లక్షలు ఉన్నట్లు అతడి వాలెట్ డిస్‌ప్లేలో చూపించారు. విత్‌డ్రా చేసుకోనివ్వకుండా మీకు ఐపీవో షేర్లు మంజూరయ్యాయని చెప్పారు. దీనికి అదనంగా రూ.14 లక్షలు ఐపీవో షేర్లు కొన్న తర్వాతనే నీ అకౌంటులో వున్న రూ.8.30 లక్షలు విత్ డ్రా చేసుకోవచ్చని, లేదంటే విత్ డ్రా కాదని చెప్పారు. సతీష్ అకౌంటులో వున్న రూ.8.30 లక్షలు విత్‌డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. దీంతో మేల్కొన్న బాధితుడు సతీష్ తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సగటున రోజుకు మూడు నుంచి నాలుగు ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక తరహా మోసాన్ని పోలీసులు పసికట్టి అవగాహన కల్పించేలోగా.. సైబర్ నేరగాళ్లు మరో తరహా మోసానికి తెరలేపుతున్నారు. సైబర్ నేరాల నియంత్రణపై తిరుపతిలో ప్రత్యేకంగా సైబర్ సెల్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని కళాశాలలు, కమ్యూనిటీ కేంద్రాలు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చే వారికి అవగాహన కల్పిస్తున్నారు. బాధితులు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ తెలిపారు. డబ్బులు పోయిన గంటలోగా ఫిర్యాదు చేస్తే వెనక్కు రప్పించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాగా, బాధితులకు అవగాహన లేకపోవడం, నేరగాళ్లు చెప్పే మాటలకు నమ్మి మోసపోవడం, ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరుగుతుండడంతో సైబర్ పోలీసులకు దర్యాప్తు అవరోధంగా మారుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్వామి ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయ్



తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదాలు చాలా అద్భుతంగా ఉన్నాయని నటుడు శివాజీ అన్నారు. తిరుమలలో ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీలో కొత్త ధర్మకర్తల మండలి వచ్చిన తర్వాత అన్నీ బ్రహ్మాండంగా ఉన్నాయన్నారు. అందరూ సమానం అనేలా కొనసాగుతోందన్నారు.





నేలపట్టులో సందర్శకుల సందడి

దొరవారిసత్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో పక్షుల కేంద్రంలోని విడిదిలో ఉన్న విహంగాలను చూసేందుకు తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి సందర్శకులు విచ్చేశారు. శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌ల్లో పనిచేసే ఉద్యోగులు కూడ నేలపట్టుకు వచ్చారు. చెరువుల కట్టలపైన ఉన్న వాచ్ టవర్స్, సందర్శన ప్రాంతాల నుంచి పక్షులను వీక్షించారు. వన్యప్రాణి సంరక్షణ శాఖ ఏర్పాటు చేసిన బైనాక్యులర్ల ద్వారా దూరంలో ఉండే పక్షులనూ వీక్షించారు. ఈ పక్షుల కేంద్రాన్ని జర్మనీ దేశీస్తులు సందర్శించారు. శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేసే కుటుంబం పక్షులను వీక్షించింది. ఇటువంటి పక్షుల కేంద్రం అరుదుగా ఉంటుందని వారు అభిప్రాయ పడ్డారు.

బడి ‘గంట’ పెరిగింది!

● హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు తరగతులు

● 34 పాఠశాలల్లో నేటినుంచి ప్రయోగాత్మక పరిశీలన



ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని డీఈవో తెలిపారు.

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పని వేళలు గంట పెరిగింది. ప్రస్తుతం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఇకపై సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలు నడుస్తాయి. ఓ గంట సమయం పొడిగిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికోసం ప్రతి జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపికచేసి పైలట్ ప్రాజెక్ట్ కింద కొత్త సమయం ప్రకారం నిర్వహిస్తున్నారు. ఆ మేరకు జిల్లాలో మండలానికొకటి చొప్పున 34 పాఠశాలలను డీఈవో కేవీఎన్ కుమార్ ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో సోమవారం నుంచి 30వ తేది వరకు పైలట్ ప్రాజెక్ట్ కింద కొత్త సమయాల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరగనున్నాయి. ఈ వారం రోజులపాటు ఇక్కడ ఉదయం మొదటి పీరియడ్‌ను 5 నిమిషాలు పెంచి 50 నిమిషాలు చేశారు. మిగిలిన పీరియడ్లను 40 నుంచి 45 నిమిషాలకు పెంచారు. ఉదయం, మధ్యాహ్నం బ్రేక్‌ల సమయం 5 నిమిషాల చొప్పున, భోజన విరామం 15 నిమిషాలు పెంచారు. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. దీనిని పునఃపరిశీలించాలని కోరుతున్నాయి. అయితే, విద్యా ప్రమాణాలను పెంచేందుకే

సమంజసం కాదు.

అందుకే పాఠశాలల పని గంటల పెంపు యోచన సమంజసం కాదు. 70 శాతం పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. మూడు నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి లేదా సైకిళ్లపై వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది. బాలికలకు ఇది ఎంతమాత్రం మంచిది కాదు. ఇన్నిన్ని గంటల చదువు వల్ల విద్యార్థి అభ్యసనా సామర్థ్యం తగ్గుతుంది.

- కె.ధనుంజయ నాయుడు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు

పునరాలోచించాలి

ఇప్పటికే రకరకాల యాప్‌లు, శిక్షణలు, వివిధ బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ సమయం పెంపు తలకు మించిన భారంగా మారుతుంది. గ్రామీణ విద్యార్థుల స్థితిగతులు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి.

- ఎస్.బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

సహేతుకమే

విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సహేతుకమే. పిల్లలు ఇంటికి వెళ్లిన తరువాత సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని, మరో గంట వారు పాఠశాలలో ఉంటే చదువుకుంటారని పెద్దలు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని తల్లిదండ్రులు కూడా స్వాగతిస్తున్నారు. 30వ తేదీ వరకు అమలుచేసి ఆపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

- కె. వెంకట నాగేంద్ర కుమార్, డీఈవో



నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే, శాప్ చైర్మన్

నారావారిపల్లెలో ఏర్పాట్ల పరిశీలన

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో 28వ తేదిన జరిగే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు సీఎం చంద్రబాబునాయుడు, లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఇక్కడి ఏర్పాట్లను ఆదివారం రామ్మూర్తి పెద్ద కుమారుడు గిరీష్‌తో కలిసి ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పరిశీలించారు. వేలాదిమందికి తగిన ఏర్పాట్లు చేయాలని, అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. వాహన పార్కింగ్, తాగునీరు, భోజన వసతి తదితరాలపై చర్చించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ టీడీపీ మండలాధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, కోదండరామానాయుడు, వేమూరు మధు, గిరిధర్‌నాయుడు, రాకేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



వరి పైరును తొక్కివేసిన ఏనుగులు

భాకరాపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం పంట పొలాలపై గజరాజులు దాడి చేసి ధ్వంసం చేశాయి. శనివారం రాత్రి దిగవూరు పంచాయతీ శాంతినగర్ చెరువులోకి వచ్చి అక్కడి నుంచి సమీపంలోని సుబ్రహ్మణ్యంకు చెందిన చెరుకు తోటతోపాటు అదే గ్రామానికి చెందిన దండు లక్ష్మయ్య మొక్కజొన్న, మామిడి తోటలోని చెట్లను విరిచేశాయి. గాండ్లపల్లెకు చెందిన రామనాథ మామిడి తోటలో చెట్లు విరిచేశాయి. ఈశ్వరయ్యకు చెందిన నేపియర్ పశుగ్రాసం, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. పూజారివాండ్లపల్లెకు చెందిన మనోహర్ రెడ్డి వరి పైరును తొక్కి ధ్వంసం చేశాయి. ఏనుగుల సంచారం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో కరెంటు కట్

దేవపట్లవారిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుత్ తీగల తగిలి ఏనుగు మృతి చెందింది. మరణించిన ఏనుగు కోసం.. మిగతా ఏనుగుల గుంపు వచ్చి చుట్టుపక్కల ఉన్న పంట పొలాలను ధ్వంసం చేస్తాయేమోనన్న భయంతో రైతులు విద్యుత్ తీగలు అమరుస్తారేమోనని అధికారులు అనుమానించారు. దీంతో శనివారం రాత్రి ఎగవూరు, దిగవూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాను ఆపివేశారు. భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్ఐ రాఘవేంద్ర, భాకరాపేట రేంజర్ వెంకటరమణ తమ సిబ్బందితో ఆ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు.

సీఎంకు చిత్రపటం అందజేత



సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న కలంకారీ కళాకారుడు శ్రీనివాసులు రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును క్యాంపు కార్యాలయంలో ఆదివారం పట్టణానికి చెందిన కలంకారీ కళాకారుడు, శిల్పగురు అవార్డు గ్రహీత శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు తాను గీసిన చంద్రబాబు కలంకారీ చిత్రాన్ని అందజేశారు. దీంతో సీఎం ఆయనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

● 8.5కేజీలు గంజాయి స్వాధీనం



మహమ్మద్ నజీర్, కృష్ణకుమార్

శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందింది. ఎస్ఐ నరసింహారావు, సిబ్బందితో కలిసి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నజీర్(35), కృష్ణకుమార్(29) రెండు గోనె సంచుల్లో గంజాయిని ఉంచుకుని రోడ్డుపక్కన నిలబడి ఉండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి 8.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసుఅధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

వెటర్నరీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అవార్డులు



ధృవీకరణ పత్రాలతో విద్యార్థులు

తిరుపతి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని వెటర్నరీ కళాశాలలో ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో తిరుపతికి చెందిన ఎస్వీ వెటర్నరీ కళాశాల అధ్యాకులు, విద్యార్థులు పలు అంశాల్లో అవార్డులు పొందారని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఓరల్ ప్రజంటేషన్‌లో డాక్టర్ కె.సుధీర్ ప్రథమస్థానం, పి.నస్వర్‌ఖాన్ ద్వితీయ, వి.మోనిష్, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డిలు మూడవస్థానం సాధించారని తెలిపారు. పోస్టర్ విభాగంలో ఎం.వరలక్ష్మి, కె.ఆకాష్‌లు ప్రథమస్థానం, యు.రేణుక తృతీయ స్థానంలో నిలిచి సర్టిఫికెట్లు, అవార్డులు సాధించారని ప్రకటించారు.

బాలికపై అత్యాచారం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
● పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలికపై ఇంటర్ చదువుతున్న యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి తల్లి ఆదివారం యూనివర్శిటీ సీఐ రామయ్యకు ఫిర్యాదు చేసింది. సీఐ తెలిపిన ప్రకారం.. అమ్మమ్మ, నాన్నమ్మ ఇంటి వద్ద ఉండి ఓ యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 15 రోజుల కిందట ఇతడు ఎనిమిదేళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి మిఠాయిలు తీసిస్తానని చెప్పి తన ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. ఇంటి వెనుక ఉన్న రేకుల షెడ్డులో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎక్కడా చెప్పకూడదని బాలికను బెదిరించడంతో ఇంట్లో చెప్పలేదు. కాగా, ఆదివారం ఆ బాలిక ఇంటి వద్ద ఏడుస్తూ ఉండగా తల్లి ప్రశ్నించడంతో ఆ విషయం తెలిపింది. దీంతో బాలికతో కలిసి ఆమె తల్లి యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షల అనంతరం డాక్టర్లు ఇచ్చే నివేదిక మేరకు పోక్సో కేసు నమోదు చేయనున్నారు.

ట్యాక్సీ, ఆటోడ్రైవర్లను విచారించిన టీటీడీ విజిలెన్స్

తిరుమల, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): అలిపిరి, శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు కాలినడకమార్గం వరకు ఆటో, ట్యాక్సీలను నడిపే డ్రైవర్లను టీటీడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. సాధారణంగా ప్రతిరోజు శ్రీవారిమెట్టు మార్గంలో నడిచే భక్తులు 5 వేల దివ్యదర్శన టికెట్లను జారీ చేస్తారు. కొంతమంది ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు తాము దర్శన టికెట్లు ఇప్పిస్తామని భక్తులకు చెప్పి తమ వాహనాల్లో శ్రీవారిమెట్టు వరకు తీసుకువెళ్లి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారుల దృష్టికి వచ్చింది. ఈక్రమంలో కొంతమంది డ్రైవర్లను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిసింది. అలాగే డ్రైవర్లతో టోకెన్లు జారీ చేసే సిబ్బందికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

'దేవకీనందన వాసుదేవ'కు విశేష ఆదరణ

● గల్లా జయదేవ్ వెల్లడి



కేక్ కట్ చేస్తున్న హీరో గల్లా అశోక్, గల్లా జయదేవ్ తదితరులు

తిరుపతి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గల్లా అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' సినిమాకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అమరరాజా సంస్థల చైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన, తన కుమారుడు అశోక్‌తో కలసి తిరుపతిలోని కృష్ణతేజ థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ కేక్‌కట్ చేశారు. ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశారు. అశోక్ నటించిన రెండో సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు జయదేవ్ ధన్యవాదాలు తెలిపారు. చిత్రానికి పబ్లిసిటీ తక్కువగా ఉన్నా ప్రేక్షకుల ఆదరణ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా సిద్ధార్థ, హర్ష గౌరినేని, నరసింహనాయుడు, బాలకృష్ణారెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, మునినాదం, బడి సుధాయాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.





తందనాన భళా.. తందనాన..!

ఆకట్టుకున్న సామూహిక అన్నమయ్య కోలాట నృత్య ప్రదర్శన ● వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే..' 'తందనాన భళా.. తందనాన' అంటూ సాగిన అన్నమయ్య సామూహిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కళా ప్రదర్శనతో ఎస్వీయూ పరిపాలనా భవన ప్రాంగణం శోభాయమానంగా కనిపించింది.అన్నమయ్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏక కాలంలో 1,250 మందితో ఎస్వీయూ వేదికగా నిర్వహించిన సామూహిక కోలాట నృత్య ప్రదర్శన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించుకుంది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధి నరేంద్ర, ఏపీ కో-ఆర్డినేటర్ అరుణ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందించారు. ఆర్కే అబాకస్ అధినేత రామకృష్ణారెడ్డి, ఎస్వీయూఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణయాదవ్, బీజేపీ నాయకురాలు సుమతిరెడ్డి, ఇంజినీరింగ్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

గుడితో పాటు మూడు ఇళ్లల్లో చోరీ

బంగారు వెండి నగదు అపహరణ ● ఏఎస్ఐ ఇంటి తాళాలు ధ్వంసం ● సిద్ధుగారిపల్లెలో దొంగల స్వైర విహారం

ఎర్రావారిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం మండలం సిద్ధుగారిపల్లెలో శనివారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు స్వైర విహారం చేశారు. మూడు ఇళ్లు దోచుకుని, వినాయక గుడిలోని హుండీని పగుల కొట్టి నగదు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. చింతగుంట పంచాయతీ సిద్ధుగారిపల్లెలో 25 ఇళ్లున్నాయి. ఊరికి దక్షిణం వైపు వినాయక స్వామి గుడి ఉంది. శనివారం రాత్రి 11.30 గంటల వరకు స్థానికులు గుడివద్ద భజన చేసి ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి దుండగులు గ్రామానికి వచ్చి గుడిలోని హుండీ పగుల కొట్టారు. అందులోని సుమారు రూ.6 వేలను అపహరించారు. గుడి పక్కనే ఉన్న శాంతమ్మ ఇంటి ప్రహరీ దూకి తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి ఒకటన్నర కిలో వెండి వస్తువులు, 10 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. వారి ఇంటికి దగ్గరే వున్న సిద్దయ్య ఇంట్లో రూ.లక్ష అపహరించారు. ఆ పక్కనే ఉన్న ఏఎస్ఐ కోదండరామయ్య ఇంటి తాళాలు పగలకొట్టి ఇల్లంతా వెదికారు. తిరుపతిలో ఉన్న కుమార్తె ఇంటికి శాంతమ్మ వెళ్లారు. పెయింటర్ అయిన సిద్ధయ్య అన్నమయ్య జిల్లా పీలేరులో పనిచేస్తూ అప్పుడప్పుడు వస్తుంటారు. ఏఎస్ఐ కోదండరామయ్య అన్నమయ్య జిల్లా కేవీపల్లె పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంటారు. ఈ ఇళ్ల వద్ద ఎవరూ ఉండరని ముందుగానే గుర్తించిన దుండగులు.. శనివారం రాత్రి భజన ముగిసిన పిమ్మట చోరీకి పాల్పడ్డారు.





ఓ ఇంట్లో చిందరవందరగా పడివున్న వస్తువులు, హుండీని పగులగొట్టారిలా..

బాధితుల సమాచారంతో పోలీసులు గుడి, ఇళ్లను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శబరిమల యాత్రకు ఆర్టీసీ నూతన సర్వీసులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఆరు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశారు. భక్తుల ఆదరణను ముందుగానే గ్రహించి శబరిమలైకి టూర్ ప్యాకేజీలకు నడుపుతోంది. ఈ నెల 26, 30 తేదీల్లో ఒక్కొక్క బస్సు చొప్పున ఇప్పటికే అయ్యప్ప దీక్ష భక్తులు నమోదు చేసుకున్నారు. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాలు, సందర్శక ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగేలా పర్యటనలను ఖరారు చేశారు. ప్రైవేటు బస్సులతో పోలిస్తే రూ.300తగ్గింపు ధరతో టికెట్లు ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ డిపో క్లర్క్ ఈ.ఎం.రెడ్డెప్పనాయుడు(7382881507, 9440983564)ను సంప్రదించాలని తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ కోరారు.

శబరిమల టూర్ ప్యాకేజీ వివరాలిలా...

●5-6రోజుల ప్యాకేజీ టూర్ (ఒకరికి రూ.3,750) : తిరుపతి, వేలూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, భవానీ, దిండుగల్, కోయంబత్తూరు, గురువాయూర్, త్రిశూర్, ఎరిమేలి, పంబా, నీలక్కల్. తిరుగు ప్రయాణంలో తిరునల్వేలి, తిరుచందూర్, రామేశ్వరం, మధురై, పళని, శ్రీరంగం, సమయాపురం, తంజావూర్, తిరువణ్ణామలై, కంచి, తిరుపతి.

●7-8 రోజుల ప్యాకేజీ టూర్ (ఒకరికి రూ.5,600) : తిరుపతి, బెంగళూరు, మైసూర్, శ్రావణబెల్, గుల్బార్గ్, మూగాంబిక, మురుడేశ్వర్‌గోకర్ణ, ఉడిపి, ధర్మస్థలం, కొక్కె, మంగళూరు, గురువాయూర్, కోడంగళూరు, ఎరిమేలి, నీలక్కల్. తిరుగు ప్రయాణంలో కుట్రాలం, కన్యాకుమారి, మధురై, పళని, శ్రీరంగం, సమయాపురం, తిరువణ్ణామలై, వేలూరు, తిరుపతి.

●10-11రోజుల ప్యాకేజీ టూర్ (ఒకరికి రూ.6,700) : తిరుపతి, చిలకలూరుపేట, కోటప్పకొండ, భద్రాచలం, విజయవాడ, నరసారావుపేట, డోర్నాల, శ్రీశైలం, ఆత్మకూరు, నంద్యాల, మహానంది, కడప, రాయచోటి, మదనపల్లె, చింతామణి, ముల్బాగల్, కోటిలింగాలు, కుప్పం, కృష్ణగిరి, సేలం, భవానీ, కోయంబత్తూరు, తిరుచూర్, గురువాయూర్, ఎరిమేలి, పంబా. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి, తిరుచందూర్, రామేశ్వరం, మధురై, పళని, తిరుచ్చి, తంజావూరు, శ్రీరంగం, మేల్‌మరవత్తూరు, కంచి, తిరుత్తణి, తిరుపతి.

చంద్రగిరి ప్రజలకూ శ్రీవారి దర్శనం కల్పించండి

సీఎంకు ఎమ్మెల్యే నాని విన్నపం



సీఎంకు విన్నవిస్తున్న నాని

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకూ నెలలో మొదటి మంగళవారం తిరుమల శ్రీవారి దర్శనం కల్పించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. స్వామివారు తిరుమలకు వెళ్లకముందు శ్రీనివాసమంగాపురంలో కొలువుదీరినట్లు పలు శాసనాలు చెబుతున్నాయన్నారు. పద్మావతి వెంకటేశ్వరస్వామి చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం మీదుగా శ్రీవారిమెట్టు మార్గాన తిరుమలకు వెళ్లినట్లు పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు ఏడుసార్లు చంద్రగిరి మార్గంలో తిరుమలకు వెళ్లి స్వామివారికి పలు కానుకలు సమర్పించి దర్శించుకున్నట్లు టీటీడీలో శాసనాలు కూడా చెబుతున్నాయన్నారు. పురాతన కాలం నుంచి చంద్రగిరికి, తిరుమల శ్రీవారికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. కావున చంద్రగిరి ప్రజలను స్థానికులుగా గుర్తిస్తూ స్వామివారి ఉచిత దర్శన కల్పించాలని సీఎంకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విశ్వవ్యాప్తం.. తిరుపతి సాంస్కృతిక వైభవం

మహతిలో ముగిసిన రెండు రోజుల అన్నమయ్య సంగీత నృత్యోత్సవం



జ్యోతివెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నిర్వాహకులు, అతిథులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి సాంస్కృతిక వైభవం విశ్వవ్యాప్తమైందని అన్నమయ్య వంశస్థుడు తాళ్లపాక హరినారాయణాచార్యులు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో రెండు రోజులుగా నిర్వహించిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవం-2024 లో భాగంగా ఆదివారం చేపట్టిన సమాపనోత్సవంలో ఆయన ప్రసంగించారు. స్థానిక ప్రజలు, భక్తుల ఆదరణతోనే నిర్విరామంగా కళావైభవం కొనసాగుతోందన్నారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, టీటీడీ మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, రిటైర్డు హ్యాండ్లూమ్ శాఖ అధికారి ఎస్.ధర్మయ్య, అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు బీఎస్ రెడ్డి, రంగస్థల కళాకారుల వేదిక అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, విశ్వం విద్యాసంస్థల ఏడీ విశ్వచేతన్‌రెడ్డి, తిరుపతి సిటీ ఛాంబర్ నేత అయూబ్ ఖాన్, జబ్బార్ ట్రస్ట్ అధ్యక్షులు ఫరీద్ సాహెబ్ మాట్లాడారు. అతిథులు, కళాకారులను జై కిసాన్, జై జవాన్, జై కళాకార్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రమణరావు సత్కరించారు. పలు కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మొదటి ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు



తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ కారు అదుపుతప్పి కల్వర్టు గట్టును ఢీకొంది. ఈప్రమాదంలో కర్ణాటక భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో ఆదివారం ఉదయం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని ఏనుగుల ఆర్చ్ దాటిన తర్వాత కారు అదుపు తప్పి 35వ నెంబరు కల్వర్టు గట్టును ఢీకొంది. వెంటనే ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో భక్తులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం దెబ్బతింది. ప్రమాదానికి గురైన కారును టీటీడీ ఆటోక్లినిక్ సహాయంతో తిరుపతికి తరలించారు.

క్షత్రియ ఉద్యోగులచే కార్తీక వనభోజనం



ఓబీఆర్ కండ్రిగ లో మాట్లాడుతున్న టీటీడీ ఉద్యోగ సంఘం నేతలు

వడమాలపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం ఓబీఆర్ కండ్రిగలోని ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం క్షత్రియ ఉద్యోగులు కార్తీక వనభోజనం నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం నిర్వహించి, నెల్లిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం టీటీడీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం చేశారు. టీటీడీ ఉద్యోగ సంఘం నాయకులు రుక్మాంగధరాజు, రుద్రరాజు గురుప్రసాద్ రాజు, ప్రభుత్వ క్షత్రియ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు ఐక్యమత్యానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బలరామరాజు, శివరాజు, కేఎల్.వర్మ, రాధాకృష్ణ, నిరంజన్ తదితరులు హాజరయ్యారు. ఎ.పరమేశ్వరరాజు, వి.సుబ్రహ్మణ్యంరాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు నేతలు ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు అందజేశారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, గతంలో ఉన్న ప్రమాద బీమా రూ.2లక్షలను ఇప్పుడు రూ.5లక్షలకు పెంచడం సంతోషంగా ఉందని తెలిపారు. నాయకులు బిరుదాల సిద్దారెడ్డి, చెంగల్రామానాయుడు, రాధారాయల్, తులసీరామ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నవీన్‌రాయల్, ముఖేష్‌రెడ్డి, మణి, శివ, వెంకటరమణ, మునిరాజ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టు చట్టాన్ని స్వాగతిస్తున్నాం

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో నామినేటెడ్ పోస్టు చట్టాన్ని స్వాగతిస్తున్నా మని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నేత గుంటికోవెల బాలాచారి పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించే విశ్వబ్రాహ్మణులకు ఒక నామినేటెడ్ పోస్టు కేటాయిస్తూ చట్టం చేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ అసెంబ్లీలో ప్రతిపాదించడాన్ని స్వాగతిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కోటి లింగేశ్వరాలయ కుంభాభిషేకం

రామచంద్రాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కామాక్షి సమేత కోటి లింగేశ్వరాలయ కుంభాభిషేకం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గణపతి, మృత్యుంజయ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంలో 108 శివలింగాల మధ్యన కోటి లింగేశ్వరస్వామిని ప్రతిష్ఠించనున్నారు. మరో గర్భాలయంలో కామాక్షిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సోమవారం ఉదయం 9 గంటలకు కుంభాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట సుప్రీం కోర్టు జడ్జి సందీప్ మెహత

తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహత ఆదివారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ధ్వజ స్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని పద్మావతిదేవి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు జస్టిస్ సందీప్ మెహతను శేషవస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెటర్నరీ విద్యార్థి జ్యోష్నిక ప్రతిభ



సర్టిఫికెట్ అందుకుంటున్న జ్యోష్నిక

తిరుపతి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో ఎస్వీ వెటర్నరీ కళాశాలకు చెందిన బీవీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థి జ్యోష్నిక ప్రథమస్థానం సాధించిందని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. విద్యార్థినిని ఆయనతోపాటు ఓఎస్‌ఏ ప్రొఫెసర్ డాక్టర్ వేణు, అధ్యాపకులు అభినందించారు.

29న లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల, నవంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని కాలినడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం జరుగనుంది. ఈనెల 29వ తేదీన ఈకార్యక్రమాన్ని నిర్వహించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. కార్తీకమాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం టీటీడీకి ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూలమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వితరణ చేయనున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంది. త్రినేత్ర డాన్స్ అకాడమీ, నటరాజ డాన్స్ అకాడమీ, నృత్యప్రియ డాన్స్ అకాడమీ, కళ్యాణి డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు లలిత, లక్ష్మి, చరిత, సాహితీ, తన్మయి, జయంత్, రూపశ్రీలు పలు అన్నమయ్య కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదర్‌వల్లీ సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

అలర చంచలమైన ఆత్మలందుండేవు..!

- ఆకట్టుకున్న అన్నమయ్య జాతీయ కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'అలర చంచలమైన ఆత్మలందుండేవు..' అంటూ సాగిన అన్నమయ్య జాతీయ కవి సమ్మేళనం ఆద్యంతమూ ఆకట్టుకుంది. తిరుపతిలోని యూత్ హాస్టల్లో ఆదివారం ఈ కార్యక్రమాన్ని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య నిర్వహించింది. వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కవులు అన్నమయ్యపై రూపొందించిన కవితలను చదివి వినిపించారు. అన్నమయ్య జీవిత, సాహిత్యానికి సంబంధించిన విశేషాలను కవితా రూపంలో వ్యక్తం చేశారు. నిర్వాహకులు కేఎం దేవేంద్ర రావు తదితరులు కవులను శాలువా, జ్ఞాపిక, ధృవీకరణ పత్రంతో సత్కరించారు. కవులు సోము ఉమాపతి, ఆముదాల మురళి, యువశ్రీ మురళి, కృష్ణవేణి, శ్రీరాజు, గోవిందయ్య, షాజహాన్, నారాయణస్వామి, కన్నయ్య, రెడ్డెప్ప, లావణ్య, విజయలక్ష్మి, కన్నయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ చాంపియన్‌గా ఉత్తరాంధ్ర



ట్రోఫీని అందుకుంటున్న విజేత జట్టు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్తరాంధ్ర జట్టు విజయం సాధించింది. తుదిపోరులో రాయలసీమపై ఉత్తరాంధ్ర జట్టు విజయకేతనం ఎగురవేసింది. వ్యవసాయ కళాశాల మైదానంలో ఆదివారం జర్నలిస్టుల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్పీ సుబ్బరాయుడు, సాయిసుధ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాత్రికేయుల మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కోసం తరచూ క్రీడా పోటీలలో పాల్గొనాలని కోరారు. డాక్టర్ సుకుమార్ విజేతలకు ట్రోఫీ, బహుమతులు ప్రదానం చేశారు. ఏపీ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు బొల్ల సతీష్, ఓబులం ప్రసాద్, వేణుగోపాలరావు, తలారి రెడ్డెప్ప, నాగలింగస్వామి, ప్రకాష్, సురేంద్ర, అబ్దుల్‌బాయ్, అజయ్, నాగవర్ధన్, విజయ్, జగదీష్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎన్‌ఫోర్సుమెంటు, అర్బన్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ అర్బన్ సీఐ రామచంద్ర, ఎన్‌ఫోర్సుమెంటు సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ వి.పృథ్వీ ఇందిరానగర్‌లో దాడులు చేశారు. డిఫెన్సు మద్యం విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన కె.గణేష్‌ను అరెస్టు చేశారు. 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పెద్దమల్లయ్య నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జయశంకర్ చెప్పారు.

ఎవరెస్ట్ శిఖరంపై అభినయ్

- తిరుపతి చిత్రపటం, పార్టీ జెండా ఎగురవేసిన వైసీపీ తిరుపతి ఇన్‌చార్జి



ఎవరెస్ట్ శిఖరంపై తిరుపతి చిత్రపటాన్ని ఎగురవేస్తున్న అభినయ్

తిరుపతి(జీవకోన), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. బేస్‌క్యాంప్‌లో 5,364 మీటర్ల ఎత్తుకు వెళ్లి ఆదివారం తిరుపతి చిత్రపటాన్ని ప్రదర్శించారు. వైసీపీ జెండాను రెపరెపలాడించారు. ఆయన మాట్లాడుతూ అత్యున్నత శిఖరంపై పార్టీ పతాకాన్ని ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. రానున్న కాలంలో ఏపీలో వైసీపీ జెండా రెపరెపలాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా తనకెంతో ఇష్టమైన తిరుపతి చిత్రపటాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. అభినయ్‌ను పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

తిరుపతి ఉపాధ్యాయినికి ఎన్‌సీసీ ఏఎన్‌ఓ అవార్డు



అవార్డు అందుకుంటున్న భారతి

తిరుపతి(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఉపాధ్యాయురాలికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రస్థాయి ఎన్‌సీసీ అవార్డు లభించింది. సరోజినీదేవి రోడ్డులోని ప్రభుత్వ బాలికల పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని సి. భారతి నేతృత్వంలో ఎందరో విద్యార్థినులు ఎన్‌సీసీలో ప్రతిభ సాధించారు. ఈ క్రమంలో ఎన్‌సీసీ శిక్షకులకు ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో ప్రదానం చేసే అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ (ఏఎన్‌ఓ) అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం ఆమె ఈ అవార్డును అందుకున్నారు.


పాటలతో ప్రజా చైతన్యం



మాట్లాడుతున్న పెంచలయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాటల ద్వారా ప్రజా చైతన్యానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం - ప్రజా నాట్యమండలి సంయుక్తంగా తిరుపతిలో ఆదివారం పాటలు పోటీలు నిర్వహించాయి. బైరాగిపట్టెడలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెంచలయ్య మాట్లాడుతూ సాహిత్యమూ, కళలు సమాజాన్ని చైతన్యం చేయడానికి సాధనాలని తెలిపారు. ప్రజలను ఉద్యమాల వైపు నడిపిస్తోంది పాటేనని తెలిపారు. ఈ తరం సంగీతం, సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అరసం అధ్యక్ష, కార్యదర్శులు కిట్టన్న, యువశ్రీ మురళి, ఏఐటీయూసీ నేత రాధాకృష్ణ, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, కళాకారులు సుబ్బు, ఉదయ్, సుమతి, శివ, జనార్ధన్ పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక వన భోజనం



వనభోజనంలో పాల్గొన్న బ్రాహ్మణ ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సమాజ కార్తీక వన భోజన మహోత్సవం తిరుపతిలో ఆదివారం వేడుకగా సాగింది. త్యాగరాజ మండపంలో బ్రాహ్మణ సమాజ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటాచలం, అజయ్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్తీక మాసం హిందువులకు పవిత్రమైందని తెలిపారు. కార్తీక వన సమారాధాన సమాజాన్ని ఒక్కటి చేస్తాయని అభిప్రాయపడ్డారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బ్రాహ్మణ సమాజ సభ్యులు ప్రభాకర్, చక్రవర్తి రాఘవన్, దక్షిణామూర్తి, నరసింహాచార్య, హరిప్రసాద్, భీమాస్ అశోక్‌కుమార్, రవికుమార్, నాగరాజు, రామశర్మ, గౌరీశంకర్, రాజీవ్ లోచన్, విజయలక్ష్మి, మురళి, పట్టాభి రామారావు పాల్గొన్నారు.

వరద సహాయార్థం రూ.25లక్షలు వితరణ



సీఎంకు చెక్ అందజేస్తున్న ఏపీ హోటల్స్ అసోసియేషన్

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడను అతలాకుతలం చేసిన వరదబీభత్సం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ తరపున రూ. 25లక్షలు వితరణ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళానికి సంబంధించిన చెక్‌ను అందించినవారిలో ఏపీ హోటల్స్ అసోసిషన్ అధ్యక్షులు ఆర్.వి. స్వామి, కార్యదర్శి ఎం.నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరి రఘువీర్, ట్రెజరర్ ఈ.వి.పూర్ణచంద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు చిల్లీస్ అంజి, సభ్యులు ఉన్నారు.

ఎస్పీని కలసిన సుధారాణి



సాయిసుధా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుధారాణి ఆదివారం ఎస్పీ సుబ్బరాయుడును కలిశారు. మీడియా స్పోర్ట్స్ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల మైదానంలో కలసి జిల్లాలో శాంతిభద్రతలు బాగున్నాయంటూ అభినందించారు.

- తిరుపతి(నేరవిభాగం) ఆంధ్రజ్యోతి

అసాంఘిక కార్యకలాపాలకు

కేరాఫ్ గరుడ వారధి



గరుడ వారధిపై మద్యం సీసాలు, టపాకాయల కాగితాలు, (ఇన్‌సెట్‌లో) కేక్ కట్టింగ్ అట్ట పెట్టెలు, గోడలపై పిచ్చిరాతలు, గీతలు

తిరుపతి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించిన గరుడ వారధి మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. రాత్రి 9 గంటల తర్వాత మద్యం సీసాలతో గరుడవారధిపైకి చేరుకుని తాగి తూగుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో గడుపుతూ ఫూటుగా మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడ పడేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు పుట్టిన రోజు కేక్ కటింగ్‌లు, టపాకాయలు పేల్చడం, బీర్లు తాగడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ దృశ్యాలు బయటి ప్రాంతాల నుంచి భక్తిభావంతో వచ్చే యాత్రికులను అసహనానికి గురిచేస్తున్నాయి. కాగా, వారధి అంచుల్లో ఏర్పాటు చేసిన గోడలకు అసభ్యకర రాతలు, గీతలు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. పైగా వారధిపై పారిశుధ్యం పూర్తిగా లోపించింది. అధికారులు వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని ప్రదర్శించి, పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మంగళం జిల్లా పరిషత్ ట్రెండ్స్ పాఠశాలలో ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు క్రీడాజ్యోతి వెలిగించి పోటీలకు నాంది పలికారు. సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే చర్యలు చేపడుతామన్నారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. డీవైఈవో బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక పెరుగుదల ఉంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం కేశవులనాయుడు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 13ఉమ్మడి జిల్లాల నుంచి 418మంది బాలబాలికలు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు పోటీలకు హాజరయ్యారు.

తొలిరోజు లీగ్ పోటీల ఫలితాలిలా...

- బాలికల విభాగంలో : ప్రకాశంపై శ్రీకాకుళం, అనంతపురంపై పశ్చిమగోదావరి జట్లు విజయం సాధించాయి.
- బాలుర విభాగంలో : నెల్లూరుపై కృష్ణా, కర్నూలుపై పశ్చిమగోదావరి, కృష్ణాపై శ్రీకాకుళం, పశ్చిమగోదావరిపై ప్రకాశం, గుంటూరుపై విశాఖపట్నం జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

పోటాపోటీగా రూరల్ ప్రీమియర్ లీగ్



బహుమతులు అందుకుంటున్న వాలీబాల్, త్రోబాల్ విజేతలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీయూలో రూరల్ ప్రీమియర్ లీగ్ 2024 పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు, క్రీడాకారులను వచ్చేనెల మొదటివారం జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామోత్సవ పేరుతో ఇషా ఫౌండేషన్ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇషా ఫౌండేషన్ తిరుపతి ప్రాంత కన్వీనర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కిషోర్‌కుమార్, వ్యాయామ విభాగం సంచాలకులు ఆచార్య శివకుమార్‌రెడ్డి, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, ఎస్వీయూ సీఐ రామయ్య పాల్గొన్నారు.

విజేతల వివరాలిలా...

- వాలీబాల్ : వడమాలపేటకు చెందిన బాలుర జట్టుకు మొదటి బహుమతిగా రూ.9వేలు, అనపగుంటకు చెందిన బాలుర జట్టు రెండో బహుమతిగా రూ.6వేలు లభించాయి. భాకరపేట జట్టు మూడో బహుమతిగా రూ.3వేలు, తిరువాట్టంకు చెందిన మానిక్‌ఫ్రెండ్స్‌కు నాలుగో బహుమతిగా రూ.2వేలు లభించాయి.
- త్రోబాల్ : శివశక్తి(తాటితోపు)కి మొదటి బహుమతిగా రూ.5వేలు, మంగళంకు చెందిన వారాహీకి రెండో బహుమతిగా రూ.3వేలు లభించాయి. జోనల్స్ పోటీలకు ఎంపికయ్యారు. తిరుచానూరుకు చెందిన పద్మావతి మూడో బహుమతిగా రూ.2వేలు, కరకంబాడీకి చెందిన లక్ష్మీ బృందానికి నాలుగో బహుమతిగా రూ.1,500 లభించాయి.

అఖిల భారత యాదవ మహాసంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసులయాదవ్



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసుల యాదవ్

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసుల యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన యాదవుల సమాఖ్య సభలో జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్యయాదవ్ నియామకపత్రం అందజేశారు. యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీనివాసుల యాదవ్ పేర్కొన్నారు.

ఉద్యమాలకు సిద్ధంకండి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలను రద్దు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేలా, రైతుల భూములను కార్పొరేట్లకు అప్పగించే విధంగా చట్టాలను మార్చి అమలు చేస్తోందన్నారు. చెరువులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు పింఛను సౌకర్యం కల్పించాలని, ఎన్నికల హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎ.రామానాయుడు, మాంగాటి గోపాల్‌రెడ్డి, పి.హేమలత, ఆర్.వెంకయ్య, గోవిందస్వామి, కార్మిక సంఘం నాయకులు జి.బాలసుబ్రమణ్యం, కె.రాధాకృష్ణ, భారతి, జయచంద్ర, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యవర్గ సమావేశం తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీకాళహస్తీశ్వర ఆర్యవైశ్య వాసవీ సత్రంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఏపీ సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 జనవరి 1 నుంచి పెన్షనర్ల వేతన సవరణతో పాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అదే వేదికపై బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రప్ప, సౌందర్యరాజన్ తెలిపారు. అన్ని సర్కిల్స్, జిల్లాల కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించి, విద్య, ఉపాధితో పాటు చట్టసభల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 52 శాతం బీసీ జనాభా ఉన్నా పాలకులు జనగణనతో పాటు కులగణన నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఇదే డిమాండ్ మేరకు సోమవారం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నాయకులు మధు ఆచారి, జగదీష్, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

గ్రేడ్-1 గ్రంథాలయానికి పోటీ పరీక్షల మెటీరియల్ వితరణ



తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): న్యూబాలాజీ కాలనీలోని రేడియో స్టేషన్‌కు వెనుకవైపున్న గ్రేడ్ - 1 గ్రంథాలయానికి చంద్రగిరి మండలం బుచ్చినాయుడు పల్లెకు చెందిన డి.వెంకటేశ్వర్లు నాయుడు రూ.6 వేల విలువైన పుస్తకాలను వితరణగా అందజేశారు. ఎంకే నాయుడు మేనల్లుడైన వెంకటేశ్వర్లు వీటిని గ్రంథాలయాధికారి జె.శివప్రసాద్‌కు ఆదివారం గ్రంథాలయంలో అందజేశారు.

నిరుపయోగంగా స్టూడెంట్స్ హోం

- చెట్లు, కలుపు మొక్కలతో నిండిన వైనం
- పట్టించుకోని వెటర్నరీ వర్సిటీ పెద్దలు



చెట్లు, కలుపు మొక్కలతో నిండిన స్టూడెంట్స్ హోం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో ఏళ్ల తరబడి విద్యార్థులకు వసతి గృహంగా ఉపయోగపడిన స్టూడెంట్స్ హోం భవనం నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి కట్టిన ఈ భవనం ఇలా నిరుపయోగంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది. గతంలో బీవీఎస్సీ ఫస్టియర్ విద్యార్థులకు స్టూడెంట్స్ హోంలో వసతి కల్పించేవారు. పెరుగుతున్న అవసరాల రీత్యా కొత్త హాస్టల్ భవనాలను నిర్మించారు. ఈ క్రమంలో స్టూడెంట్స్ హోంను గాలికి వదిలేశారు. యూనివర్సిటీలోని ప్రధాన రహదారి పక్కనే, పరిపాలనా భవనానికి కూతవేటు దూరంలో చెట్లు, చెదారం, కలుపు మొక్కలతో నిండిపోయిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. పాలనాపరమైన అవసరాల కోసమైనా ఈ భవనం ఉపయోగించుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

వాడుకలోకి తెస్తాం..

స్టూడెంట్స్ హోం పరిస్థితిపై సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అవసరమైన మరమ్మతులు చేపడతాం. స్టూడెంట్స్ హోంను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ పి.రవికుమార్, రిజిస్ట్రార్, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

నేడు ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ తొలి సినిమా మన దేశం 1949లో విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న సందర్భంగా సోమవారం తిరుపతిలో ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక నిర్వహిస్తోంది. మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రచయిత వీఏకే రంగారావు, రిటైర్డు ప్రొఫెసర్ సత్యవాణి, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయండి



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి సమన్వయంతో అందరూ పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస మినీఫంక్షన్ హాలులో ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ సమక్షంలో ఓజిలి మండలంలో వైసీపీకి చెందిన ఇద్దరు సర్పంచులు, 100 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. అనంతరం విజయశ్రీ మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు.నరసింహ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచి పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుజ్జలపూడి విజయ కుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అంకితభావం అభినందనీయం



కార్మికులకు బహుమతులను అందజేస్తున్న ముత్తుగోవిందస్వామి

తడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఇబ్బందులు ఎదురైనా కార్మికులందరూ అంకితభావంతో పనిచేశారని అపాచీ పరిశ్రమ జీఎం ముత్తుగోవిందస్వామి అన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం జరిగి పదేళ్ల పూర్తయిన సందర్భంగా అప్పటి సమ్మె సమయంలో రవాణా సౌకర్యం లేకపోయినా విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన సుమారు 2వేల మంది కార్మికులకు ఆదివారం కృతజ్ఞతా పూర్వక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపాచీ జీఎం ముత్తుగోవిందస్వామి మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో సకల జనులు సమ్మెలో ఉన్నా తమ పరిశ్రమ కార్మికులు యథావిధిగా పనిచేశారని కొనియాడారు. తద్వారా పరిశ్రమకు నష్టం వాటిల్లకుండా చూశారని, కార్మికుల అంకితభావానికి కృతజ్ఞతగా వారిని కుటుంబసభ్యుల సమక్షంలో అభినందిస్తున్నామన్నారు. అనంతరం 2210 మంది కార్మికులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు కార్మికులు, వారి పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పరిశ్రమ ఏజీఎం గెవిన్‌చాంగ్, హెచ్‌ఆర్ మేనేజర్ షరీఫ్, పీఆర్ మేనేజర్ మోహన్, ఏపీఆర్‌వో భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులు నిబంధనలు పాటించాలి



ఏఈఎస్పీ ఊహశ్రీ, పక్కనే టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఈఎస్పీ ఊహశ్రీ అన్నారు. ఆదివారం ఆమె సూళ్లూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం షాపులు సమయ పాలన పాటించాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత షాపులు మూసివేయాలని, పరిసరాల్లో ఎక్కడా మద్యం విక్రయించరాదన్నారు. అలాగే షాపుల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకూడదన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే సూళ్లూరుపేట, గూడూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాదాపు 50 కేసులకు పైగా నమోదు చేశామన్నారు. ఆమెతో పాటు సీఐ బాలకృష్ణ ఉన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించడం సరికాదు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సెలవురోజుల్లో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సతీష్, దీపు, సుజిత్, శశి, మధు, సుమన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధాత్రివనం పూజలు



ధాత్రివనం పూజల్లో వేదపండితులు, భక్తులు

చిల్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ధాత్రివనం పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలోని తోటలో వేదపండితుల మంత్రోచరణల నడుమ భక్తులు ధాత్రివనం పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళలకు దుస్తుల అందజేత

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ డబ్ల్యూ కళాశాలలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు వైజేపీ లయన్స్‌క్లబ్ గవర్నర్ గౌతమ్ ఆదివారం దుస్తులు, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఏరియా ఆస్పత్రిలో బాలింత లకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనార్దన రావు, హనుమంతరావు, గురు నాథం, మురళీ నాయుడు, శీను, మనోజ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వీరావు, ప్రసాద్, మురళి, శివరామ్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎన్‌ఫోర్స్ మెంటు, అర్బన్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ అర్బన్ సీఐ రామచంద్ర, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ పి.పృథ్వీ ఇందిరానగర్‌లో దాడులు చేశారు. డిఫెన్సు మద్యం విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన కె.గణేష్‌ను అరెస్టు చేశారు. 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పెద్దమల్లయ్య నుంచి 10మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ చెప్పారు.

వరినాట్లకు కూలీల కొరత

యంత్రాలతో వరినాట్లు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో యంత్రాలతో వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని మన్నారుపోలూరు, మంగానెల్లూరు తదితర గ్రామాల్లో కూలీల లభ్యత తక్కువగా ఉండడంతో పలువురు రైతులు యంత్రాలను తీసుకొచ్చి నాట్లు వేసుకొంటున్నారు. యంత్రాల సాయంతో ఒక గంటకు ఎకరం భూమిలో వరినాట్లు వేస్తుండగా రూ.3500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.



మన్నారుపోలూరు వద్ద వరినాట్లు వేస్తున్న యంత్రం



వరినాట్లు నాట్లు వేస్తున్న పశ్చిమబెంగాల్ వాసులు

పెళ్లకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఎక్కడా కూలీలు రాకపోతుండడంతో ఇతర రాష్ట్రాల నుంచే వచ్చే వారిపైనే ఆధార పడాల్సివస్తోంది. మండలంలోని మహిళలు పెళ్లకూరు చుట్టుపక్కల ఏర్పాటైన పరిశ్రమల్లో పనిచేసేందుకు వెళ్తున్నారు. దీంతో వరినాట్లు వేసేందుకు కూలీలు దొరక్క ఇతర రాష్ట్రాల నుంచి రెట్టింపు కూలి ఇచ్చి తీసుకువస్తున్నారు. గతంలో నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.2500 ఖర్చవుతుండగా ప్రస్తుతం రూ.5500కు చేరుకుంది. పొలం చదును చేసేందుకు చెక్క తొలగానికి గతంలో రూ.1500 ఇస్తుండగా ప్రస్తుతం రూ.2200 ఇవ్వాల్సి వస్తోంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో చేరిన అరకొర నీటితో పొలాలకు నీరుపెట్టి దుక్కి చేసినా సకాలంలో నాట్లు వేయకుంటే నీరు నిలబడదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.





తందనాన భళా.. తందనాన..!

ఆకట్టుకున్న సామూహిక అన్నమయ్య కోలాట నృత్య ప్రదర్శన
వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే.' 'తందనాన భళా.. తందనాన' అంటూ సాగిన అన్నమయ్య సామూహిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కళా ప్రదర్శనతో ఎస్వీయూ పరిపాలనా భవన ప్రాంగణం శోభాయమానంగా కనిపించింది. అన్నమయ్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏక కాలంలో 1,250 మందితో ఎస్వీయూ వేదికగా నిర్వహించిన సామూహిక కోలాట నృత్య ప్రదర్శన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించుకుంది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధి నరేంద్ర, ఏపీ కో-ఆర్డినేటర్ అరుణ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే అబాకస్ అధినేత రామకృష్ణారెడ్డి, ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, బీజేపీ నాయకురాలు సుమతిరెడ్డి, ఇంజినీరింగ్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

పులికాట్ నగర్‌లో చోరీ

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో (కేఆర్ పాలెం) చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. షార్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న నజీర్ పులికాట్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. ఇంట్లో ఉన్న వస్తువులను చిందవందర పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు బాధితుడు నజీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల టీడీపీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని ఆదివారం సన్మానించారు. తీర ప్రాంత గ్రామాలైన కొరిడి - పేర్నాడు రోడ్డు గురించి తొలిసారిగా అసెంబ్లీలో ప్రస్తావించ డంతో ఎమ్మెల్యేను సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దామరాయి, కడపత్ర సర్పంచులు రమణమ్మ, చెంచమ్మ, నాయకులు గొంజి వెకంటేశ్వర్లు, తిరుపాల్, ఎల్లయ్య, ప్రభాకర్ ఉన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు రామకృష్ణ

వెంకటగిరిటౌన్, నాయుడుపేట, కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. యూటీఎఫ్ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి యూటీఎఫ్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, ఉదయకుమార్, గంగారావు, వెంకటేశ్వర్లు, సరస్వతి శ్రీనివాసులు, కృష్ణమూర్తి, రాధాకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ● నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. బాబురెడ్డి, రామమూర్తిరాజు, రాజశేఖర్, శేఖర్, చంద్రశేఖర్, సాయిలక్ష్మి, నాగూరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● కోట పట్టణంలోని షాదీమందిర్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, రమేష్, బాబురెడ్డి, మనోహర్, భాస్కర్, ముమాయిష్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మేథాశక్తి పెంపు



చెస్‌పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రసాద్, చెస్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెస్ ఆడడం వల్ల విద్యార్థుల్లో లలో మేథాశక్తి పెరుగుతుందని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ అన్నారు. ఆదివారం కళాశాలలో ఆంధ్రాచెస్, తిరుపతి జిల్లాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఫణికుమార్, మంజుల, నరేంద్ర పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతపూజల్లో భక్తులు

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎస్ రాయులు కల్యాణ మండపంలో ఆదివారం కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రజేంద్రరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవానీ శంకరుడికి రుద్రాభిషేకాలు



భవానీ శంకరుడికి అన్నాభిషేకం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం షిరిడీసాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో కార్తీక మాసన వనభోజనాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతులతో పాటు షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో భవానీ శంకరుడికి రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని అన్నంతో అలంకరించారు. అనంతరం భక్తులు వన భోజనాలు చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ డే వేడుకలు



ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, నావెల్ యూనిట్ ఏఎన్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. కళాశాల ప్రాంగణంతో పాటు గూడలి, విద్యానగర్ ఆర్‌ఎంబీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

సాధూపేటలో కార్డెన్ సెర్చ్



ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాధూపేటలో ఆదివారం ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవీకరణ పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన కొణతాలపల్లి రామసుబ్బయ్య రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి చెక్కును అందజేశారు. దాతకు ఆలయ అధికారులు రశీదు ఇచ్చారు.

'దేవకీనందన వాసుదేవ'కు విశేష ఆదరణ

● గల్లా జయదేవ్ వెల్లడి



కేక్ కట్ చేస్తున్న హీరో గల్లా అశోక్, గల్లా జయదేవ్ తదితరులు

తిరుపతి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గల్లా అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' సినిమాకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అమరరాజా సంస్థల చైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన, తన కుమారుడు అశోక్‌తో కలసి తిరుపతిలోని కృష్ణతేజ థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ కేక్‌కట్ చేశారు. ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశారు. అశోక్ నటించిన రెండో సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు జయదేవ్ ధన్యవాదాలు తెలిపారు. చిత్రానికి పబ్లిసిటీ తక్కువగా ఉన్నా ప్రేక్షకుల ఆదరణ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా సిద్ధార్థ, హర్ష గౌరినేని, నరసింహనాయుడు, బాలకృష్ణారెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, మునినాదం, బడి సుధాయాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచేది టీడీపీనే



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి అండగా నిలిచే ఏకైక పార్టీ టీడీపీనేనని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికీ రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందన్నారు.

మన్నారుపోలూరులో టీడీపీ సభ్యత్వ నమోదు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గిరిజన కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునస్వామి, శ్రీనివాసులు, మోదుగు కృష్ణయ్య, మునిశేఖర్, యుగంధర్, సీహెచ్ సురేష్, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో...

ఓజిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, విశ్రాంత పారా మెడికల్ అధికారి దారా అంకయ్య ఆధ్వర్యంలో గ్రామ దళిత, గిరిజన కాలనీలలో 500 సభ్యత్వాలు నమోదు చేశారు.

చెంగాళమ్మ సేవలో ఆర్టీసీ జోనల్ చైర్మన్



చెంగాళమ్మను దర్శించుకొని బయటకు వస్తున్న సురేష్ రెడ్డి, పక్కన బీజేపీ నేతలు ఆదినాయణ రెడ్డి, శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మను ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపు రెడ్డి సురేష్‌రెడ్డి ఆదివారం దర్శించు కొన్నారు. ఆయనకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఎన్.శ్రీనివాసులు, చెన్నకేశవులు, మనోహర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సీఎంకు కలంకారీ చిత్రపటం అందజేత



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును క్యాంపు కార్యాలయలంలో ఆదివారం పట్టణానికి చెందిన కలంకారీ కళాకారుడు, శిల్పగురు అవార్డు గ్రహీత శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు తాను గీసిన చంద్రబాబు కలంకారీ చిత్రాన్ని అందజేశారు. దీంతో సీఎం ఆయనను ప్రశంసించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ముక్కంటి ఆలయంలో కార్తీక మాసంలో ఆకాశదీపాన్ని ప్రతి రోజు వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసి స్తూపానికి అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు దర్శించుకున్నారు.

పరశురామేశ్వరుడి సేవలో తిరుమంగళం స్వామి



ఏర్పేడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం తమిళనాడు తిరుమంగళంలోని చిదంబరేశ్వర మఠానికి చెందిన స్వాములు గణేష్ స్వామి అయ్యర్, వెంకటరామన్ స్వామి అయ్యర్, శివఅయ్యర్, అంబలిస్వామి తదితరులు స్వయంభు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 8.5కేజీలు గంజాయి స్వాధీనం



మహమ్మద్ నజీర్, కృష్ణకుమార్

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఎస్‌ఐ నరసింహారావు, సిబ్బందితో కలిసి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నజీర్, కృష్ణకుమార్ రెండు గోనె సంచుల్లో గంజాయిని ఉంచుకుని రోడ్డు పక్కన నిలబడి ఉండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి 8.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసుఅధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను ముచ్చటించుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, శైలజ, భారతి, గాయత్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గోల్డెన్ అవర్‌లో సపర్యలు ముఖ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న అతిథులు

పుత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు వ్యాయామం చేస్తున్నా గుండెపోటు రావడానికి కారణాలను ఫిజీషియన్ సిద్ధార్థ రెడ్డి వివరించారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించే(గోల్డెన్ అవర్)లోగా వెల్లికిలా పడుకోబెట్టాలని, గుండెపై రెండు చేతులతో గట్టిగా నొక్కాలని, అలాగే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిలో ఎమర్జెన్సీ రూంను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని డాక్టర్ అర్ముగం సూచించారు. ప్రాథమిక చికిత్సలు అందించకుండా దూరపు ఆస్పత్రులకు తీసుకెళ్లడం మంచిది కాదని వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇటీవల చెన్నైలో ఐఎంఎ నుంచి ఫెలోషిప్‌ను అందుకున్న ఇంటర్నేషనల్ వాకర్స్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ విశ్రాంత డాక్టర్ రవిరాజును సన్మానించారు. ఈ సమావేశంలో కె.ఎల్.ఎన్. మూర్తి, మునికృష్ణయ్య, గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతి పెద్ద యూనిఫాం యువజన దళం ఎన్‌సీసీ

పుత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫాం యువజన దళం ఎన్‌సీసీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. కళాశాల నుంచి ముగ్గురు క్యాడెట్లు ప్రీ రిపబ్లిక్ క్యాంపులో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. వివిధ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న క్యాడెట్లకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు వాణిశ్రీ, దేవకి, గాయత్రి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో వడమాలపేట క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులు

వడమాలపేట, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు పతకాలు సాధించినట్లు పీడీ చంద్రశేఖర్ రాజు చెప్పారు. తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీ నుంచి 24 తేదీ వరకు రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్ 19 జూడో పోటీల్లో వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు చిన్మయి (44 కిలోలు), భవిత(40 కిలోలో), జాహ్నవి (36 కిలోలు) ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. భవిత 40 కిలోల విభాగంలో వెండి పతకాన్ని, జాహ్నవి 36 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. విద్యార్థులను పలువులు అభినందించారు.

టీటీడీ ఉద్యోగుల కార్తీక వనభోజనం

వడమాలపేట, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబీఆర్ కండ్రిగ ఉమామహేశ్వర ఆలయంలో టీటీడీ ఉద్యోగులు వనభోజనాన్ని నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించి, నెల్లిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం టీటీడీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘం నాయకులు రుక్మాంగదరాజు, గురుప్రసాద్ రాజు, రాష్ట్ర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బలరామరాజు, శివరాజు తదితరులు హాజరయ్యారు.

ముగిసిన ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులు పాటు జరిగిన ఓటర్ల ప్రత్యేక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ... ఫారం 6, ఫారం 7, ఫారం 8కు 30 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

లారీల పార్కింగ్‌కు అడ్డాగా వీఐపీ రహదారులు





ఈ చిత్రంలో కనిపించేవి విమానాశ్రయానికి వెళ్లే వీఐపీ రహదారులు. కానీ నిరంతరం లారీల పార్కింగ్‌కు అడ్డాగా మారాయి. తిరుమల దర్శనం కోసం విమానాశ్రయంలో దిగి కొత్త చెక్‌పోస్టు కూడలి మీదుగా కరకంబాడి వైపు, మరో పక్క కేవీఎం ఆస్పత్రి జంక్షన్ మీదుగా తిరుచానూరు వైపు వెళ్తుంటారు. ఈ మార్గంలో ఇరువైపులా నిత్యం పెద్ద ఎత్తున లారీలు పార్కింగ్ చేస్తున్నారు. వీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకుని లారీల పార్కింగ్‌ను నియంత్రించాల్సి ఉంది. డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా ఈనెల 25నాటికి హైవే పనులు పూర్తవుతాయన్నారు. కాంట్రాక్టర్ రోడ్డు ప్రభుత్వానికి అప్పజెబుతారన్నారు. విమానాశ్రయ పరిసరాల్లోని రహదారులను పరిశీలించి బాధ్యులతో సమావేశం నిర్వహించి పార్కింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు.

-రేణిగుంట, ఆంధ్రజ్యోతి

శివనాథపాళెంలో కార్డన్ సెర్చ్: 14 ద్విచక్రవాహనాలు, ఆటో స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసులు

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం శివనాథపాళెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో శివనాథపాళెంలో తనిఖీలు చేపట్టారు. అందులో పత్రాలు సరిగా లేని 14 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

రేకుల షెడ్ల కూల్చివేతపై కేసు నమోదు



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రహదారి చల్లామాంబపురం వద్ద రెండు రేకుల షెడ్లను కూల్చి వేయడంపై పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. చల్లామాంబపురానికి చెందిన మునెయ్య భార్య శాంతి శ్రీకాళహస్తి రహదారి ఆనుకుని ఉన్న స్థలంలో రేకుల షెడ్లు వేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. స్థల యజమాని మునెమ్మ మరిది రమేష్ ఆదివారం రేకుల షెడ్లను కూల్చి వేశారు. దీనిపై బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులకు మరమ్మతులు



కళత్తూరు పెద్ద చెరువు

కేవీబీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరమ్మతులు ప్రారంభమయ్యాయి. గండ్లను పూడ్చడం, కట్టలను పటిష్ఠ పరచడం తదితర పనులను చేపడుతున్నట్టు జలవనరుల శాఖ ఏఈ బాబు తెలిపారు. దీంతో పాటు పంట కాలువల నిర్వహణ మరమ్మతులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మిన్నల రవికి ఘనసన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన పురపాలక సంఘ మాజీ వైస్‌చైర్మన్ మిన్నల రవిని ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇలాంటి పదవులు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమణ్యయ ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు బత్తినయ్య ముదిరాజ్, బొజ్జల గోవిందస్వామి ముదిరాజ్, చిన్న ముదిరాజ్, మునికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీవీనాయుడికి....

మాజీ ఎమ్మెల్యే ఎస్వీవీనాయుడిని ఆదివారం పలమనేరులో కమ్మ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కమ్మ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి తన వంతు సాయంగా ఎస్వీవీనాయుడు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌నాయుడు, టి.ప్రకాష్ నాయుడు, సురేష్‌నాయుడు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలుంటే కఠిన చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): షాపుల్లో తూనికలు, కొలతల్లో కొలతలు తేడాలుంటే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని దుకాణాల్లో ఆయన ఆదివారం తూనికలు, కొలతలను పరిశీలించారు. యేటా తప్పనిసరిగా తూనికలకు ముద్రలు వేయించుకోవాలన్నారు. తూనికలు తక్కువగా ఉన్న పలు షాపుల యజమానులకు జరిమానా విధించారు.

వేదోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేదోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చనలను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో కార్యక్రమాన్ని రుత్వికులు చేపట్టారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చన సాగించారు. అనంతరం తిరిగి సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని అభిషేక గురుకుల్ రాజేష్ గురుకుల్, వేదపండితులు చేపట్టగా, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టిడ్కో గృహాల తనిఖీ



పిచ్చిమొక్కలతో నిండిన గృహ సముదాయం - స్థానికులతో మాట్లాడుతున్న జనసైనికులు

ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల పరిధిలో టీసీఎల్ పరిశ్రమ సమీపంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను ఆదివారం జనసేన నాయకులు తనిఖీ చేశారు. ఇక్కడ 1800 గృహాలకు కాను 250 ఇళ్లలో మాత్రమే నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ... టిడ్కో ఇళ్లను గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా వాడుకుంటున్నారన్నారు. దీంతో ఇక్కడ నివాసం ఉన్న వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వీటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, నాయకులు మునికుమార్, రవి, శివశంకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీకి ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



వ్యాపారులకు సూచనలిస్తున్న రవికుమార్

సత్యవేడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారులందరూ తమ జీఎస్టీ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని శ్రీసిటీ సర్కిల్ స్టేట్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంవలో ఆదివారం శ్రీసిటీ సర్కిల్ పరిధిలోని వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ... నూతన జీఎస్టీ చట్టం మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారులు 2024 అక్టోబరు నుంచి తాము చెల్లిస్తున్న బాడుగకు సంబంధించి జీఎస్టీ ట్యాక్స్‌ను ప్రభుత్వానికి చెల్లించాలని తెలిపారు. రిటర్నింగ్ దాఖలు సకాలంలో చేయాలని, పన్నులు క్రమం తప్పకుండా చెల్లించాలని తెలిపారు. జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ షరీన, ఇందిర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సత్యవేడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు నందిని, చైతన్య ట్రస్ట్ ఎండీ చాగణం గౌరీశంకరర్, సీఈవో సీతారామనాయుడు, ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పాండురంగయ్య, అరవింద్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నాయుడుపేటకు చెందిన పెనగలూరు లీలావతి కుటుంబ సభ్యులు సుబ్బరామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి తదితరులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుడిమల్లం ఆలయానికి స్టీల్ ప్లేట్ల వితరణ

ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం చిత్తూరుకు చెందిన కన్నన్ కుటుంబీకులు స్టీల్‌ప్లేట్లను వితరణ చేశారు. ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి 51ప్లేట్లను అందించారు. అదే విధంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, వేదపండితులు పవన్ శర్మ, వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

కేవీబీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో కళత్తూరు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం కంటి వైద్య ఉచితశిబిరాన్ని 26వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ లేదా గుర్తింపుకార్డు తీసుకురావాలని కోరారు.

హైందవ శంఖారావం సన్నాహక సమావేశం

ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండారుపల్లిలో వినాయకస్వామి ఆలయం వద్ద హైందవ శంఖారావం సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ధనంజయులు, కాటయ్య, హరి, నాదముని, దేవరాజు, దాము, మునిబత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి



నివాళులర్పిస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెండ్లిమండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు చెంచురెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి కూడా నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ జయచంద్ర ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రౌడీషీటర్లపై పోలీసులు నిఘా ఉంటుందని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ హబీబుల్లా, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



క్యాడెట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం గిరిప్రకాష్

పిచ్చాటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించి మానవ మనుగడకు ఇతోధికంగా ఉపయోగపడదామని పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం గిరిప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ బాలికల 5వ పటాలం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. ఎన్‌సీసీ 5వ పటాలం ఇన్‌చార్జి మీనాకుమారి, ఉపాధ్యాయులు అమ్ములు, సుబ్రహ్మణ్యం, రమేష్, శేషరెడ్డి, నెయిల్స్, వలర్‌మది, మునిరత్నమ్మ, ఆనందసెల్వి తదితరులు పాల్గొన్నారు.